క్లుప్తంగా

గ్రంథాలయానికి ఫ్యాన్‌ల వితరణ



గ్రంథాలయానికి సీలింగ్ ఫ్యాన్‌లను అందజేస్తున్న వంకా శ్రీను

పాయకరావుపేట : పట్టణంలో గల వైఎస్సార్ శాఖా గ్రంథాలయానికి హైకోర్టు న్యాయవాది వంకా నారాయణరావు 6 సీలింగ్ ఫ్యాన్‌లను వితరణగా పంపించినట్టు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు తెలిపారు. న్యాయవాది నారాయణరావు సోదరుడు వంకా శ్రీను చేతుల మీదుగా బుధవారం గ్రంథాలయానికి అందించినట్టు వామాల లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో నేడు జగనన్న సురక్ష

మునగపాక : మండలంలోని పాటిపల్లి, రాజుపేట గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు హాజరవుతారన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరుకావాలని అచ్చియ్యనాయుడు కోరారు.

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న అరబుపాలెం ఎంపీటీసీ బుజ్జి

మునగపాక : రైతు పక్షపాతిగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని అరబుపాలెం ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి పేర్కొన్నారు. అరబుపాలెం ఆర్‌బీకే ద్వారా రైతులకు రాయితీపై బుధవారం విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు అందజేస్తున్నామన్నారు. వీఏఏ సత్య రవిరాజ్, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు హరిపాలెం మరిడిమాంబ పండగ

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామంలో ఈ నెల 13న మరిడిమాంబ పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరానున్నారు. సాయంత్రం గ్రామంలో సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా సాయి మందిరం వార్షికోత్సవం



బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

ఎస్.రాయవరం : వేమగిరి గ్రామంలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో బాబా ఆలయ 16 వ వార్షికోత్సవం నిర్వహించి బాబాకు పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం బాబా ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మాజీ సర్పంచ్ కాళహస్తి, రంగారావు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలకు రూ.కోటి 30 లక్షలు మంజూరు

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు రూ.కోటి 30 లక్షలకు పైగా నిధులు మంజూరయ్యాయని ఎంపీటీసీ-3 బోదకుర్తి గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తుందన్నారు. మునగపాక బీసీ కాలనీలో రూ.21.60 లక్షలు, ఇతర ప్రాంతాల్లో రూ.కోటి 9 లక్షల మేర నిధులు మంజూరయ్యాయన్నారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో త్వరలో పనులు ప్రారంభమవుతాయని గణేష్ తెలిపారు.

త్వరిత గతిన ధ్రువపత్రాల జారీ

జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు ఒక్క రోజులోనే 11 రకాల సేవలకు సంబంధించి అర్జీలు పరిష్కరించి ధ్రువపత్రాలు అందజేయడం జరుగుతోందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. పట్టణంలో సురక్ష కార్యక్రమంలో ఏ ఒక్కరికి ధ్రువపత్రం రాకపోయినా తనకు ఫోన్ చేస్తే వారికి అధికారులతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరిస్తామన్నారు. యలమంచిలిలో బుధవారం తులసీనగర్‌లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 1350 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్‌తో కలసి అందజేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వనన్ని ఇళ్లు ఈ ప్రభుత్వంలో మంజూరయ్యాయని అన్నారు. కొక్కిరాపల్లి వద్ద పేదలకు జగనన్న ప్రభుత్వం అందిస్తున్న కాలనీ ఇళ్లకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. అంతకు ముందు మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, సినీ నటుడు పవన్‌కల్యాణ్ వలంటీర్ల మీద అవాకులు చవాకులు పేలుతున్నారని అన్నారు. ప్రతి పేద కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం వలంటీరు ఉద్యోగం ఇచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పించిందని, వలంటీర్ల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన పవన్ వారికి వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నాగేశ్వరరావు, గుప్తా ,కౌన్సిలర్లు శైలజ, కోరిబిల్లి లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు, మున్సిపల్ కమిషనర్ వీరయ్య, పల్లా శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు పాల్గొన్నారు. ఏటికొప్పాక గ్రామం-2 సచివాలయంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వెయ్యి మందికి ఎమ్మెల్యే కన్నబాబురాజు చేతుల మీదుగా వివిధ రకాల ధ్రువ పత్రాలు అందజేశారు. ఎంపీపీ గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ ఛైర్‌పర్సన్, ఎంపీపీ

రాంబిల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష దోహదపడుతుందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని జెడ్.చింతువా, లాలం కోడూరు గ్రామాల్లో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆయన పలురకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ శిరీషా శ్రీనుబాబు, జెడ్పీటీసీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు డీఎస్ఎన్‌రాజు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న అర్జీలకు సైతం పరిష్కారం

అచ్యుతాపురం(అనకాపల్లి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ధ్రువీకరణ పత్రాలు సైతం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వెంటనే అందుతున్నాయని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురం, ఉప్పవరం సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలో ఆయన పాల్గొన్నారు.



అచ్యుతాపురం మండలంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే



ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

ఈ సందర్భంగా ఆయన డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మతో కలిసి పలువురు అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీపీ భర్త కోన బుజ్జి, మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు, రావి శోభన్‌బాబు, భీముని వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాంబాబు, కాశీనాయుడు, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి కోసం విరివిగా నిధులు

- ఎమ్మెల్యే బాబూరావు
- చినదొడ్డిగల్లులో రూ.4 కోట్లలో అభివృద్ధి పనులు

నక్కపల్లి : వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్న సీఎం కాకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందని, ప్రస్తుత పథకాలన్నీ నిలిచిపోతాయని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం ఆయన చినదొడ్డిగల్లులో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు గ్రామంలో నెలకొన్న సమస్యలు ప్రస్తావించడంతో పాటు, ఈ ప్రభుత్వం వచ్చాక చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామసభలో మాట్లాడుతూ చినదొడ్డిగల్లులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి సమస్యను దాదాపు పరిష్కరించామన్నారు. గత ఏడాది రూ.35 లక్షలు విడుదల చేసి ఉద్దండపురం నుంచి పైపులైను ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేసామన్నారు. ఈ ఏడాది జల్‌జీవన్ మిషన్ కింద రూ.2.50 కోట్లు కేటాయించి గ్రామంలో పైపులైన్లు ఇంటింటికీ కుళాయిలుతో పాటు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నామన్నారు. నాడునేడు పథకం కింద పాఠశాలల్లో రూ.1.80 కోట్ల వ్యయంతో అదనపు తరగతులు, నూతన భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తానన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పూర్తి చేయడంతోపాటు, ఇక్కడ ఆస్పత్రి సేవలు ప్రారంభమయ్యేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఏపీఎఫ్‌యుఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, సర్పంచ్‌లు ఆనందరావు, సురేష్ వర్మ, భార్గవ్ , వెంకటేష్, ఎంపీటీసీలు సత్తిబాబు, గోవిందు,డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, వేణురాజు, దావీదు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.



చినదొడ్డిగల్లులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఉప్పరాపల్లిలో జగనన్న సురక్ష

ఎస్.రాయవరం : జగనన్న సురక్షతో గ్రామాల్లో అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతోందని ఉప్పరాపల్లి, వెంకటాపురం సర్పంచ్‌లు శానాపతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం అన్నారు. ఉప్పరాపల్లి సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులకు ముందుగా సిద్ధం చేసిన కుల, ఆదాయ ధ్రువ పత్రాలు అందజేశారు. రైతులు భూ సమస్యలు, రోడ్డు సమస్యలు, వీధుల్లో డ్రైనేజీ సమస్యలు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. కొత్త రేవుపోలవరం గ్రామంలో ఎంపీడీవో బృందంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య సమస్య నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు. సర్పంచ్‌లు మల్లే లోవరాజు, చోడిపల్లి అనూరాధ పాల్గొన్నారు.



ఉప్పరాపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందిస్తున్న సర్పంచ్‌లు

కుండపోత వర్షం.. రహదారులు జలమయం



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిలిచిపోయిన వర్షపు నీరు

కోటవురట్ల: వరుణుడు మళ్లీ వర్షించాడు. బుధవారం కుండపోతగా సుమారు గంటపాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎంపీడీవో కార్యాలయం ఎదుట డ్రైనేజీ లేకపోవడంతో భారీగా నీరు నిలిచిపోయింది. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చాలా కాలంగా సమస్య ఉన్నా అధికారులు పరిష్కారం చూపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయం



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : గ్రామాల్లో మౌలిక వసతులు పెంచి గ్రామాల్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. అరట్లకోట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం విడుదల చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఏవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అర్హత గల వారికి అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంక్షేమంతో పాటు గ్రామాల్లో రహదారుల నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కారం జరుగుతుందన్నారు.

పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం

రూ.19.5 లక్షలతో నాడు నేడు మొదటి విడత నిధులతో అభివృద్ధి చేసిన పాఠశాలను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను పంపిణీ చేశారు. సంక్షేమం, అభివృద్ధి కూడా కొనసాగాలంటే మరలా జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రి చేయాలని గ్రామస్తులను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గపల్లి సాయిబాబా, ఎంఈవో జి.రమేష్‌బాబు, సచివాలయ కన్వీనర్లు అప్పారావు, తూము రమణ, రాజాబాబు, గుణశీల, నాయకులు జగతా శ్రీను, కేశనకుర్తి సత్తిబాబు పాల్గొన్నారు.

గోపాలపట్నం, పాల్తేరులో...

పాయకరావుపేట : ప్రజల సమస్యలు గ్రామాల్లోనే ఎప్పటికప్పుడు పరిష్కారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గోపాలపట్నం గ్రామంలో బుధవారం నిర్వహించిన సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరై మాట్లాడారు. గ్రామంలో 225 అర్జీలకు గాను పలువురికి ధ్రువ పత్రాలను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.సాంబశివరావు, సర్పంచ్ పన్నీరు పాపారావు, ఈవోఆర్‌డీ సత్యనారాయణ పాల్గొన్నారు. పాల్తేరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం మండల తహసీల్దార్ కె.జయప్రకాష్ బృందం నిర్వహించింది. 179 అర్జీలకు గాను అర్హులకు జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, సర్పంచ్ గోసల కృష్ణ చేతుల మీదుగా ధ్రువ పత్రాలను అందించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

మునగపాక : విద్యాభివృద్ధికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి అన్నారు. నాడు-నేడు రెండో విడతలో భాగంగా తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి గదులకు బుధవారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదుల నిర్మాణం జరుగుతుందన్నారు. హెచ్ఎం కుమార్, పీఎంసీ చైర్మన్ భాస్కరరావు, ఉప సర్పంచ్ కొత్తలంక లక్ష్మీ త్రినాథ్, కమిటీ సభ్యుడు బొడ్డేడ శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ వెంకటరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



తోటాడ హైస్కూల్ ఆవరణలో అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మంగవేణి

బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): విత్తన శుద్ధి చేసిన తర్వాత వరి నారును వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాయుడుబాబు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల గ్రామంలో బుధవారం బీజామృతం తయారు చేసే విధానంపై రైతులకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సాగులో భాగంగా వరి విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి నారు వేసుకోవాలని సూచించారు. వీఆర్‌వో నాయుడు, సచివాలయ సిబ్బంది సత్యనారాయణపాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి దీవెనలు అందించండి

మునగపాక : నిరంతరం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి మరోసారి సీఎం కావడం తథ్యమని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. వాడ్రాపల్లి, నాగవరం సచివాలయాల్లో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారందరికీ ధ్రువకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి చేసే జగనన్న ప్రభుత్వానికి ప్రజలంతా దీవెనలు అందించాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, డీఎల్‌డీవో మంజులావాణి, తహసీల్దార్ ప్రకాశరావు, ఎంపీడీవో మన్మథరావు, పార్టీ నేతలు శీరా రమణమ్మ, సత్యనారాయణ, భాస్కరరావు, కాకి ఈశ్వరరావు పాల్గొన్నారు. కాగా వాడ్రాపల్లిలో జరిగిన సురక్ష కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో బాధ్యత లేకుండా వ్యవహరించడం తగదంటూ మండిపడ్డారు.

పచ్చి మేతతో అధిక పాల దిగుబడి

కశింకోట:పాడి పశువులకు పచ్చి గడ్డి మేత వేయడం వల్ల అధిక పాల దిగుబడి సాధించవచ్చని నరసింగబిల్లి పశువైద్యాధికారి చైతన్యమణి తెలిపారు. మండలంలోని నరసింగబిల్లిలో జగనన్న పాలవెల్లువ గ్రామాలైన అమీన్‌సాహెబ్‌పేట, నరసాపురంలలో పశు గ్రాస వారోత్సవాల్లో భాగంగా పాడి రైతులతో బుధవారం సమావేశం నిర్వహించి, క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాల ఉత్పత్తికి పచ్చి గడ్డి మేత ఆధారమన్నారు. పాల ఉత్పత్తిని పెంపొందించడానికి నాణ్యమైన పశు గ్రాసాన్ని సాగు చేసుకోవాలని సూచించారు. పాడి రైతులు తప్పనిసరిగా మేలుజాతి పచ్చిగడ్డి, కాయగడ్డితోపాటు, పప్పు జాతి గడ్డిని కూడా పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు గడ్డి విత్తనాలను అందించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ప్రతినిధి భూపతి తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతులకు పశుగ్రాస విత్తనాలను అందిస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి

మండల ఎంఈవోలు బాధ్యతల స్వీకారం



ఎంఈవో వై.మీనాక్షి



పి.అరుణ్‌కుమార్

యలమంచిలి : మండల విద్యాశాఖాధికారులుగా 1- వై.మీనాక్షి 2-పి.అరుణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన బి.విశ్వనాథం గాజువాకకు బదిలీపై వెళ్లడంతో యలమంచిలిలో రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న మీనాక్షికి అదనపు బాధ్యతలను అప్పగించినట్టు బుధవారం సాక్షికి తెలిపారు. నక్కపల్లి మండలంలో బాలికల ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉన్న పి.అరుణ్‌కుమార్ యలమంచిలి రెండో ఎంఈవోగా పదోన్నతిపై వచ్చారని తెలిపారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

ఎస్.రాయవరం : విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుని వ్యాధులకు దూరంగా ఉండాలని ఏఎన్ఎం నూకరత్నం సూచించారు. గుర్రాజుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులను నుంచి రక్త నమూనాలు సేకరించారు. విద్యార్థులు హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించి , బలహీనంగా ఉన్న విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

విద్యార్థులకు హాకీ సామగ్రి అందజేత

ఎస్.రాయవరం : విద్యార్థులకు విద్యతో క్రీడలకు కూడా ప్రభుత్వం ప్రాముఖ్యం ఇస్తోందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్.వి.రమణ అన్నారు. పి.ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం హాకీ సామాగ్రి అందజేశారు. గడిచిన వేసవిలో ఇదే పాఠశాలలో హాకీ క్యాంపు నిర్వహించామని, ఇందులో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు, హాకీ సామాగ్రి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కోరారు. చీఫ్ కోచ్ రామచంద్ర, హాకీ కోచ్ రాంబాబు, ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు, పీడీ దీపిక పాల్గొన్నారు.



హాకీ సామాగ్రి అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముంచెత్తిన వర్షపు నీరు

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోడ్డులో బుధవారం మోకాలు లోతున వర్షపు నీరు నిలిచిపోయింది. మంగళవారం రాత్రి ఇక్కడ కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో పల్లపు ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. ఇక్కడి పీహెచ్‌సీ, మండల పరిషత్ కార్యాలయానికి కూడా వెళ్లే ఈ రోడ్డులో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.



పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

రోడ్డా...చెరువా...!

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రహదారి జలమయం

ఎస్.రాయవరం : ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా సర్వసిద్ధి పీహెచ్‌సీ ముందు ఆర్అండ్‌బీ రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోయి చెరువులా దర్శనమిస్తోంది. నాడు నేడు పథకంలో ఇటీవల సర్వసిద్ధి పీహెచ్‌సీకి నూతన భవనం నిర్మాణం చేశారు. ఆ భవన నిర్మాణం కూడా ఆర్అండ్‌బీ అధికారులు చేపట్టారు. అయితే భవన నిర్మాణం చేసే క్రమంలో రోడ్డు వైపు ప్రహరీ నిర్మాణం చేసి వర్షం నీరు పోయే కాలువ కప్పివేశారు. నిర్మాణం పూర్తయిన తరువాత కాలువ తీయలేదు. దీంతో ఏమాత్రం వర్షం కురిసినా రోడ్డు నీరు నిలిచిపోయి రోడ్డు చెరువులా మారుతోంది. ఇటువంటి సమస్య వస్తుందని నిర్మాణం దశలోనే స్థానికులు కాంట్రాక్టరుకు తెలిపినా పట్టించుకోకుండా వదిలి వెళ్లాడు. బుధవారం కురిసిన వర్షానికి పీహెచ్‌సీ ముందు ఆర్అండ్‌బీ రోడ్డు చెరువులా మారింది. ఇదే ప్రాంతంలో సర్వసిద్ధి గ్రామ సచివాలయ భవనం కూడా ఉంది. అధికారులు స్పందించి రోడ్డు పై వర్షపునీరు తొలగించి, సమస్య పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.



సర్వసిద్ధి పీహెచ్‌సీ ముందు నిలిచిన వర్షపునీరు

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ

అనకాపల్లిటౌన్: గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన కొండకొప్పాక గ్రామంలో పైడితల్లి అమ్మవారి పండగ బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పీలాను సంప్రదాయబద్ధంగా సత్కరించారు.



అమ్మవారి సన్నిధిలో భక్తులు

421 మందికి ధ్రువపత్రాలు

కోటవురట్ల: జగనన్న సురక్ష కార్యక్రమంతో ధ్రువపత్రాలను పారదర్శకంగా అందిస్తున్నారని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. మండలంలోని కొడవటిపూడి, బి.కె.పల్లి గ్రామాలలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కొడవటిపూడిలో తహసీల్దారు జానకమ్మ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించి లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కొడవటిపూడిలో 432 దరఖాస్తులకు టోకెన్లు ఇవ్వగా 425 దరఖాస్తులు రిజిస్టర్ అయ్యాయని ఇందులో 421 మందికి ధృవపత్రాలు అందజేసినట్టు ప్రత్యేకాధికారి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోసూరు అప్పారావు, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంపై విచారణ

ఎస్.రాయవరం : సర్వసిద్ధి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఇవ్వాల్సి పాలు, ఇతర పోషకాహారం సక్రమంగా ఇవ్వడం లేదని స్పందనలో ఫిర్యాదు చేయడంతో బుధవారం సూపర్‌వైజర్ విచారణ చేపట్టారు. అదే సమయంలో ఫిర్యాదుదారుడు చల్లపల్లి సూరిబాబు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పరిశీలించగా ఉన్న చిన్నారులు 10 మంది అయితే 1 మంది అని చూపి సరుకులు ఇచ్చినట్టు హాజరు పట్టీలో రాసి ఉంది. వండిన అన్నం మాడిపోయి ఉంది. ఇదంతా గమనించిన సూపర్‌వైజర్ తులసి అంగన్‌వాడీ కార్యకర్త జి.విజయగౌరికి నోటీసు జారీ చేస్తున్నట్టు చెప్పారు. గురువారం నక్కపల్లి పీవోకి నివేదిక అందజేసి చర్యలు తీసుకుంటామన్నారు.

తీరప్రాంతంలో సాగర్ కవచ్

ఎస్.రాయవరం : తీరప్రాంతంలో రక్షణ వాతావరణం ఉండాలని నక్కపల్లి సర్కిల్ సీఐ నారాయణరావు సూచించారు. రేవుపోలవరం తీరంలో సాగర్ కవచ్ కార్యక్రమంలో బుధవారం సీఐ పాల్గొన్నారు. మెరైన్ , సివిల్ పోలీసులు కలిపి బందోబస్తు నిర్వహించారు. రేవుపోలవరం, బంగారమ్మపాలెం గ్రామాల్లో పోలీసు గస్తీ ఉంచారు. తీరప్రాంతంలో ప్రతి ఆరు నెలలకు ఒకమారు ఇటువంటి బందో బస్తు నిర్వహిస్తూ తీర రక్షణ పెంచుతామన్నారు.



రేవుపోలవరంలో సూచనలు ఇస్తున్న సీఐ నారాయణరావు